నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, గురువారం 9 జనవరి 2025 | RAJANNA SIRCILLA

# సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కరీంనగర్ తెలంగాణచౌక్, జనవరి 8 : సంక్రాంతి పండుగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నది. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు 770 బస్సులు, పండుగ ముగిసిన తర్వాత కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు 970 బస్సులను నడిపించనున్నది. ఈ బస్సులు ఈ నెల 7న ప్రారంభం కాగా, 16 వరకు నడువనున్నాయి. సాధారణ టికెట్ ధర కన్నా 50 శాతం అదనంగా వసూలు చేయనున్నది. బస్సుల వివరాలు తెలిపేందుకు జేబీఎస్‌లో కరీంనగర్ నుంచి డిప్యూటీ ఆర్ఎం స్థాయి అధికారితోపాటు ఇతర విభాగాల సిబ్బందిని నియమించారు. కరీంనగర్ బస్టాండ్‌లో ప్రత్యేక కంట్రోలర్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. రద్దీ అధికం ఉంటే గోదావరిఖని, మంచిర్యాల, వరంగల్, నిజామాబాద్ రూట్లలోనూ అదనపు బస్సులు నడిపించేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేక బస్సుల్లో ఆన్‌లైన్ ద్వారా టికెట్ బుకింగ్ చేసుకునే వెసులుబాటు ఉన్నది. ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, రద్దీని బట్టి బస్సులను సర్దుబాటు చేస్తామని కరీంనగర్ రీజియన్ మేనేజర్ బీ రాజు తెలిపారు.

# కలెక్టర్ పమేలా సత్పతి రక్తదానం





కరీంనగర్ తెలంగాణ చౌక్, జనవరి 8 : కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ట్రెయినీ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీటీవో పురుషోత్తం, ఆర్టీసీ ఈడీ ఖుస్రోషాఖాన్, ఆర్ఎం రాజుతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం బ్లడ్ డొనేట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని, ఆపదలో ప్రాణ దాతలుగా నిలువాలని పిలుపునిచ్చారు. పెద్దసంఖ్యలో రక్తదానం చేసిన ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందిని అభినందించారు. రక్తదాతలకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పండ్లు, పాలు, బ్రెడ్‌తో పాటు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

◄ కరీంనగర్: రక్తదానం చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

## పొరపాటుగా ప్రచురణ





'నమస్తే తెలంగాణ' జిల్లా ఎడిషన్‌లో 'కాంగ్రెస్ నాయకుల కబంధ హస్తాల్లో అసైన్డ్ భూములు?' శీర్షికన బుధవారం ప్రచురించిన కథనంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఎల్లె లక్ష్మీనారాయణ పేరిట రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లిలోని సర్వేనంబర్ 338/24 ఐదెకరాల అసైన్డ్ స్థలం ఉన్నట్టు ప్రచురితమైంది. నిజానికి ఈ స్థలం ఆయనది కాదు. సిరిసిల్ల పట్టణానికి చెందిన ఎల్లె లక్ష్మీనారాయణ తండ్రి రామయ్య అనే వ్యక్తికి చెందినదిగా గుర్తించాం. కాంగ్రెస్ నాయకుడు ఎల్లె లక్ష్మీనారాయణ తండ్రి పేరు రాజయ్య. తండ్రి పేరు గమనించకపోవడం వల్ల జరిగిన పొరపాటుతో కాంగ్రెస్ నాయకుడికి చెందిన భూమిగా ప్రచురితమైంది. ఈ స్థలంతో మాజీ ఫ్లోర్ లీడర్ ఎల్లె లక్ష్మీనారాయణకు ఎటువంటి సంబంధం లేదు. తప్పుగా ప్రచురణ జరిగిన విషయాన్ని తెలుసుకొని బుధవారం ఉదయమే నమస్తే తెలంగాణ నెట్ ఎడిషన్‌ను మార్చాం. జరిగిన పొరపాటుకు చింతించడంతోపాటు పూర్తి వివరణ ఇస్తున్నాం.

# కబ్జాకోరల్లో ఆలయ భూములు?





- భూములు, ఆస్తుల పరిరక్షణకు జీపీఎస్
- గూగుల్ మ్యాప్స్‌తో అనుసంధానం
- ముందుగా దేవాలయాలు.. ఆ తర్వాత ఆస్తుల వివరాల నమోదు
- రెవెన్యూ, సర్వే విభాగాల అధికారులు సహకరిస్తేనే సాధ్యం
- జీపీఎస్ నమోదు ప్రక్రియ నడుస్తున్నది : ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సుప్రియ

**ఆలయ భూములు కబ్జాకోరల్లో చిక్కుకున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 423 దేవాలయాల పరిధిలో 800కుపైగా ఎకరాలు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయి. ఇప్పటికే ఆక్రమణలను గుర్తించి, ఆ భూముల పరిరక్షణకు దేవాదాయ శాఖ ఎప్పటికప్పుడు చర్యలుచేపడుతున్నా పూర్తి స్థాయిలో కట్టడి చేయలేకపోతున్నది. రెవెన్యూ, సర్వే విభాగాల అధికారులు సరిగా సహకరించకపోవడం వల్లే ఆక్రమిత భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి సాధ్యపడడం లేదన్న విమర్శలున్నాయి. మరోవైపు దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లాలో ఆలయాలను గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జీపీఎస్)తో అనుసంధానం చేసే ప్రక్రియను కొనసాగిస్తున్నది. గుర్తించిన ప్రసిద్ధ దేవాలయాలు, చారిత్రక ప్రదేశాల పూర్తి వివరాలను గూగుల్ మ్యాప్స్‌లో నిక్షిప్తం చేస్తున్నది. అయితే రెవెన్యూ, సర్వే విభాగాల అధికారులు పూర్తి స్థాయిలో సహకరించినప్పుడే ఇది సాధ్యమవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆక్రమణకు గురైన భూములను చెర విడిపించి, పరిరక్షించేందుకు ఆధునిక సాంకేతికను పకడ్బందీగా వినియోగించినప్పుడే అనుకున్న ఫలితాలు వచ్చే అవకాశాలుంటాయి.**

కరీంనగర్, జనవరి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి కరీంనగర్ జిల్లా అనేక ప్రసిద్ధ దేవాలయాలకు పెట్టింది పేరు! ఎన్నో విశిష్ట దైవక్షేత్రాలకు నెలవైన నేల ఇది! దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన వేములవాడ రాజరాజేశ్వర ఆలయం నుంచి కొండగట్టు ఆంజనేయ, ధర్మపురి లక్ష్మీనరసింహ, ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయాలతోపాటు మరెన్నో క్షేత్రాలకు కేరాఫ్‌గా ఉన్నది. అయితే ఈ దేవాలయాలకు ఆధునిక సాంకేతికతను జోడించేందుకు దేవాదాయశాఖ సిద్ధమైంది. ముందుగా ఎంపిక చేసిన గుడులకు జియో ట్యాగింగ్ చేస్తున్నారు. ఆ మేరకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జీపీఎస్) కింద నమోదు చేస్తున్నారు. జీపీఎస్ మ్యాప్ కెమెరా ద్వారా చిత్రాలు తీయించి అక్షాంశాలు, రేఖాంశాలు, ప్రాంతం ఆధారంగా సమాచారాన్ని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయానికి పంపుతున్నారు. గూగుల్ మ్యాప్‌లో ఈ సమాచారమంతా నిక్షిప్తం అవుతుంది. అప్పుడు ఏదేని ఆలయం గురించి సెర్చ్ చేస్తే.. అందుకు సంబంధించిన ఫొటోలతోపాటు గుడి ప్రాశస్త్యం, విశిష్టత గురించి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ఆస్కారముంటుంది. అలాగే ఆ ఆలయానికి చేరుకోవాలంటే.. జీపీఎస్ ద్వారా ఎక్కడి నుంచైనా వెళ్లడం సులువవుతుంది. ఆలయాలకు సంబంధించిన కచ్చితమైన సమాచారం కోసం గడిచిన మూడు నాలుగు నెలలుగా ఉమ్మడి జిల్లాలో జీపీఎస్ నమోదు ప్రక్రియ కొనసాగుతున్నది. ఆలయం ఎక్కడున్నది? దాని హద్దులేమిటి? ఆ ఆలయ పరిధిలోకి వచ్చే భూములు ఎక్కడెక్కడ ఉన్నాయి? అవి ఏ సర్వే నంబర్లలో ఉన్నాయి? అన్న సమాచారాన్ని సైతం పొందు పరిచేందుకు ప్రయత్నాలు సాగుతున్నారు. ఇలా ప్రతి అంశం గురించి అందరికీ తెలిసేలా ఆధునిక సాంకేతికతతో సమాచారం పొందుపరిచేందుకు కసరత్తు చేస్తున్నారు.

**జిల్లాల వారీగా భూములున్న దేవాలయాలు, విస్తీర్ణం, ఆక్రమణల వివరాలు**

| జిల్లా | ఆలయాలు | విస్తీర్ణం (ఎకరాల్లో) | ఆక్రమణ (ఎకరాల్లో) |
|---|---|---|---|
| కరీంనగర్ | 101 | 713.04 | 144.30 |
| జగిత్యాల | 118 | 1,173.34 | 86.29 |
| పెద్దపల్లి | 111 | 1.131.09 | 551.36 |
| సిరిసిల్ల | 93 | 617.18 | 35.01 |
| మొత్తం | 423 | 3635.25 | 818.16 |

### ఆక్రమణలో 800 ఎకరాలు?

ఉమ్మడి జిల్లాలో 1400కుపైగా చిన్నా పెద్ద దేవాలయాలున్నాయి. 74పైచిలుకు ఆదాయం సమకూరే ఆలయాలున్నాయి. భూములున్న ఆలయాలు మాత్రం 423 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో 3,635.25 ఎకరాల భూమి ఉన్నట్టు అధికారులు లెక్కలు తేల్చారు. అందులో ఇప్పటికే 818 ఎకరాలపైగా ఆక్రమణకు గురైనట్టు గుర్తించారు. నిజానికి దేవాదాయ భూములు ఆక్రమణకు గురికాకుండా దేవాదాయ ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ దూస రాజేశ్వర్ పనిచేసిన సమయంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చర్యలు తీసుకున్నారు. 1954-55 పహాణీలను పరిగణలోకి తీసుకొని, ఆయా దేవాలయాల స్థిర, చరాస్తుల రిజిస్టర్లను ఆధారంగా చేసుకొని.. సర్వే నంబర్ల వారీగా ఏ దేవాలయానికి ఎంత భూములున్నాయో లెక్కలు తేల్చారు. దాని ప్రకారంగా ఆనాడు ఉమ్మడి జిల్లాలో చిన్నా పెద్దా అన్ని కలిపి 1,489 ఆలయాలు ఉన్నట్టు గుర్తించారు. ఆ తర్వాత జిల్లాలు వేరు కావడం.. కాళేశ్వరంలాంటి దేవాలయాలు ఇతర జిల్లాలకు వెళ్లడం తెలిసిందే కాగా, అప్పుడే, ఆయా ఆలయ భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు తీసుకునేందుకు ప్రయత్నించారు. కానీ, రెవెన్యూ విభాగం సహకరించక పోవడంతో తీసుకోలేకపోయారు.

### అధికారుల సహకారముంటేనే..!

ప్రస్తుతం దేవాలయాలకు చెందిన భూములు, ఆస్తుల వివరాలను చిత్రాల ద్వారా సేకరించి, వెబ్‌సైట్లలో జియోగ్రఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) ద్వారా పరిశీలించి భూముల సరిహద్దులను మార్కింగ్ చేయడానికి కసరత్తు ప్రారంభించారు. అయితే రెవెన్యూ, సర్వే విభాగం అధికారుల సహకారం ఉంటే తప్ప ఈ ప్రక్రియ పూర్తి కాదు. పూర్తి స్థాయి భూముల లెక్కలు తేలవు. అంతేకాదు, ఆక్రమణ జరిగినట్టు గుర్తించిన భూముల లెక్కలతోపాటు హద్దులు తేల్చాలన్నా సహాయం తప్పనిసరి. కలెక్టర్ల ఆధ్వర్యంలో ఒక సమావేశం ఏర్పాటు చేసి, ఒక స్పెషల్‌డ్రైవ్ వంటి కార్యక్రమం చేపడితేనే ఇది సాధ్యమవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆలయాల జీపీఎస్ నమోదు కార్యక్రమం నడుస్తున్నదని, ఇది దాదాపు పూర్తి కావొచ్చిందని కరీంనగర్ ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సుప్రియ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ఇది పూర్తయిన తర్వాత భూముల పరిరక్షణ కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు.




చిన్నారిని ఎత్తుకొని ముద్దు చేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

# కొత్తపల్లిలో ఎమ్మెల్సీ కవిత



కొత్తపల్లి శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

కొత్తపల్లి, జనవరి 8 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం రాత్రి కరీంనగర్ జిల్లా కొత్తపల్లి(హెచ్)కి వచ్చారు. ముందుగా తూర్పువాడలోని శివాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో కవిత ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత సమీపంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన నాయకుడు పసుల చరణ్, మౌనిక దంపతుల కొడుకు నిష్నాత్ ఫస్ట్ బర్త్‌డే వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించారు. బాలుడిని ఎత్తుకొని ముద్దుచేశారు. కవిత వెంట మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు జమీలొద్దీన్, జాడి శ్రీనివాస్, రుద్ర రాధ తదితరులు పాల్గొన్నారు.

# మృత్యుంజయురాలు లక్ష్మి



లారీ కింద గుర్రాల లక్ష్మి

పెద్దపల్లి టౌన్, జనవరి 8: ప్రమాదవశాత్తూ లారీ కింద పడినా.. ఆ మహిళ మృత్యుంజయురాలుగా నిలిచింది. లారీ డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో ప్రాణాప్రాయం నుంచి తప్పించుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపల్లి మండలం బొంపల్లి గ్రామానికి చెందిన గుర్రాల తిరుపతి-లక్ష్మి దంపతులు పని నిమిత్తం బుధవారం సాయంత్రం మోపెడ్‌పై కరీంనగర్ వెళ్తున్నారు. పెద్దపల్లి జిల్లాకేంద్రానికి చేరుకున్నారు. బస్టాండ్ మీదుగా యూటర్న్ తీసుకున్నారు. అంతలోనే ట్రాఫిక్ సిగ్నల్ పడడంతో దాంతో హైరాన చెందారు. ఈ క్రమంలోనే వీరి వాహనం అదుపు తప్పింది. కరీంనగర్ నుంచి గోదావరిఖనివైపు వెళ్తున్న లారీ ముందుభాగంలో కిందికి దూసుకెళ్లింది. వెంటనే లారీ డ్రైవర్ అప్రమత్తమై బ్రేక్ వేయగా, అప్పటికే ఆ మహిళ లారీ కింది భాగంలో ఇర్కుకున్నది. భయంతో కేకలు వేసింది. వెంటనే స్థానికులు అక్కడకు చేరుకొని బయటికి తీయడంతో క్షేమంగా వచ్చింది.



కేశవపట్నం పెద్ద చెరువు మత్తడి వద్ద గండి పడడంతో వృథాగా పోతున్న నీరు

# కేశవపట్నం పెద్ద చెరువుకు గండి

శంకరపట్నం, జనవరి 8: కేశవపట్నం పెద్ద చెరువుకు బుధవారం గండి పడింది. ఇటీవల సాగుకు ఎస్సారెస్పీ నీటి విడుదల కోసం కేశవపట్నం శివారులో ఎస్కేప్ ఎత్తగా పెద్ద చెరువులోకి పెద్ద ఎత్తున వరద వచ్చి నిండింది. మత్తడి వద్ద గండి పడింది. గతంలోనూ గండి పడగా, అధికారులు మరమ్మతులు చేయించారు. అయితే మత్తడి పక్కన రిటైనింగ్ వాల్ ఎత్తు తక్కువగా నిర్మించడం, పక్కన కట్ట బలహీనంగా ఉండడం వల్ల చెరువుకు మరోసారి గండి పడి నీరంతా వృథాగా పోతున్నదని రైతులు, మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి తోడు, అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఈ దుస్థితికి కారణమని పలువురు ఆరోపించారు. ఇప్పటికైనా శాశ్వత మరమ్మతులు చేసి చెరువులో నీరు నిలిచేలా చర్యలు చేపట్టాలని రైతులు, మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

# అభివృద్ధిలో కాంగ్రెస్ విఫలం

మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



పద్మనగర్ జంక్షన్ ఐలాండ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల

**కక్ష సాధింపుతోనే కేటీఆర్‌పై కేసు**

కాంగ్రెస్ రాజకీయ కక్షసాధింపు చర్యలకు దిగుతున్నది. అందులో భాగంగానే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసులు నమోదు చేస్తున్నది. అధికారం ఉంది కదాఅని బీఆర్ఎస్ నాయకులపై కేసులు అక్రమంగా బనాయిస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం మాపై ఎన్ని కేసులు పెట్టిన భయపడే ప్రసక్తే లేదు. న్యాయస్థానాలపై మాకు అపారమైన నమ్మకం ఉన్నది. ఈ కార్ రేసులో కేసులో కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తరు.

\- గంగుల కమలాకర్

కొత్తపల్లి, జనవరి 8: కరీంనగర్‌ను అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని.. ఆ పార్టీకి కరీంనగర్ నుంచి ఓట్లు రాకపోవడంతో ప్రజాప్రతినిధులు వివక్ష చూపుతున్నారని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. బుధవారం నగరంలోని 12వ డివిజన్‌లోని వెంకటేశ్వర కాలనీకి సంబంధించిన కమాన్ ప్రారంభించారు. అనంతరం ₹27లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. 16వ డివిజన్‌లోని పద్మనగర్ జంక్షన్ వద్ద అన్నమయ్య ఐలాండ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సీఎం అస్యూరెన్స్ నిధుల కింద ఏటా ₹100కోట్ల చొప్పున సుమారు ₹350కోట్లు విడుదల చేసి కరీంనగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. అలాగే స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్, స్మార్ట్‌సిటీ నిధులతో అభివృద్ధి వేగంగా జరిగిందన్నారు. కానీ, అమలుకు సాధ్యంకాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సీఎం అస్యూరెన్స్ నిధులను నిలిపివేయడంతో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. తమ హయాంలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి పదెకరాల స్థలం కేటాయించామని.. ఏపీ సీఎం చంద్రబాబు, టీటీడీ చైర్మన్‌ను కలిసి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరామని చెప్పారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేదన్నారు. 2016 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను తాము విజయవంతంగా నిర్వహించామన్నారు. వచ్చే ఫిబ్రవరిలో బ్రహ్మోత్సవాలు నిర్వహించాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదన్నారు. గతంలో నగరంలో కళోత్సవాలు, సినిమా విజయోత్సవాలుంటే.. ఇప్పుడు కష్టాలు, కన్నీళ్లే మిగిలాయన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు తోట రాములు, బోనాల శ్రీకాంత్, నాంపల్లి శ్రీనివాస్, దిండిగాల మహేశ్, కొత్తపల్లి మాజీ వైస్ ఎంపీపీ తిరుపతినాయక్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# ధ్రువీకరణ పత్రాల జారీకి కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 8 : గురుకులాల్లో విద్యనభ్యసించేందుకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల సత్వర జారీ కోసం కరీంనగర్ కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరానికి గానూ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం వచ్చే నెల 23న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండగా, ఔత్సాహిక విద్యార్థులు https://tgcet/cgg/gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకు అవసరమైన కుల, ఆదాయ, పుట్టిన తేదీ సర్టిఫికెట్లు అధికారులు సత్వరమే జారీ చేసేలా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సహాయ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం తెరిచి ఉంటుందని పేర్కొన్నారు.

# ఇదేం రోడ్డు భద్రత!?

**ఈ కింది చిత్రంలో దుమ్ముతో కనిపిస్తున్న రోడ్డు పెద్దపల్లి ఆర్టీవో కార్యాలయాన్ని ఆనుకొని రాజీవ్ రహదారి. రంగంపల్లి వద్ద ఇలా బూడిదతో నిండిపోయింది. ఈ రూట్‌లో అధికలోడ్‌తో టార్పాలిన్లు కూడా సరిగా కప్పకుండా 'రయ్..రయ్' మంటూ ఇసుక, బూడిద లారీలు, టిప్పర్లు దూసుకుపోతుండడంతో నిత్యం దమ్ము, యాష్ లేస్తుండగా, వాటి వెనుక వచ్చే వాహనాదారులు రోడ్డు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనాదారులు కండ్లల్లో బూడిద పడి ప్రమాదాలకు లోనై కాళ్లుచేతులు విరగ్గొట్టుకుంటున్నారు. కానీ, అధిక లోడ్ వాహనాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా, జాతీయ భద్రత మాసోత్సవాల పేరుతో కాలక్షేపం చేస్తున్నారని వాహనదారులు మండిపడుతున్నారు.**



- పెద్దపల్లి జిల్లాలోని ప్రధాన రహదారులు అధ్వానం
- బూడిద, ఇసుక, మట్టి ఓవర్‌లోడ్ లారీలతో దెబ్బతింటున్న దారులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టని అధికారులు
- రోడ్డు భద్రత మాసోత్సవాలు కాదు ఉల్లంఘునులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్లు

పెద్దపల్లి, జనవరి 8(నమస్తే తెలంగాణ): ప్రధాన రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. పెద్దపల్లి జిల్లాలో ప్రమాదాలకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. 'రోడ్డు భద్రత.. అందరి బాధ్యత' అంటూ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్న అధికారయంత్రాంగం, అందుకు తగ్గ చర్యలు తీసుకోకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన రహదారులైన గోదావరిఖని-కరీంనగర్, మంథని కరీంనగర్ రోడ్లపై ఇటీవలి కాలంలో ప్రయాణం నరకప్రాయంగా మారుతున్నది. జిల్లాలో సహజ వనరులైన బూడిద, ఇసుక, మట్టి, బొగ్గు, ఇటుక ఓవర్‌లోడ్‌తో లారీలు తరలివెళ్తుండడంతో కరీంనగర్ వైపు ప్రధాన రహదారిపై గాడాలు పడ్డాయి. దీంతో ఈ రోడ్డుపై వాహనాలు అదుపు తప్పి బోల్తా పడుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి. అలాగే గోదావరిఖని-కరీంనగర్, మంథని-కరీంనగర్‌కు నిత్యం వందలాది బూడిద, ఇసుక లారీలు అధిక లోడ్‌తో వెళ్తుండగా, ఆ దారుల్లో భారీగా దుమ్ము లేస్తున్నది. వాటి వెనుక వచ్చే వాహనదారులకు ముందు రోడ్డు కనిపించక ప్రమాదాలు జరిగిన సందర్భాలు లేకపోలేదు. జిల్లాలో తరచూ ప్రమాదాలు జరిగే 28 ప్రాంతాలను పోలీసులు బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించారు. కానీ ఆయాచోట్ల సూచిక లేదా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతున్నది.



**ఈ చిత్రంలో కనిపిస్తున్న లారీ పెద్దపల్లి-కరీంనగర్ రాజీవ్ రహదారిపై ఓవర్‌లోడ్‌తో వెళ్తున్నది. అందులో బూడిదను తరలిస్తుండగా, నిబంధనలకు విరుద్ధంగా ట్రాలీని రెండు మూడు ఫీట్ల వరకు ఎత్తు పెంచేశారు. ఇలాంటి ఓవర్‌లోడ్ వాహనాలు నిరంతరం నడవడం వల్లే రోడ్లు ఛిద్రమవుతున్నాయి. గాడాలు పడుతున్నాయి. కట్టడి చేయాల్సిన రవాణాశాఖ అధికారులు చోద్యం చూస్తుండడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయనే విమర్శలున్నాయి.**